

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | శుక్రవారం 03 నవంబర్ 2023 | www.navatelangana.com

బస్సు వచ్చేదెన్నడో..?

- చాలా గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సు
- స్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు నడవాల్సిందే
- అత్యవసర సమయాల్లో ప్రజలకూ ఇబ్బందులు

8లో...



నేడు శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్

- 10వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ
- 13 వరకు స్క్రూట్నీ, 15 వరకు విత్‌డ్రాకు అవకాశం

8లో...





కాంగ్రెస్‌వస్తే దళారుల రాజ్యం

- బీఆర్‌ఎస్ హయాంలో ఎలాంటి పైరవీలు లేకుండానే పథకాల అమలు
- ప్రశాంత్‌రెడ్డి నా కొడుకులాంటి వాడు
- పెద్దమనిషిగా ఉంటే బాల్కొండ కూడా పెద్దవుతుంది
- ప్రశాంత్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించండి
- ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తదని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆపద్బాంధు పథకం కింద రూ.50 వేలు ఇచ్చే పథకాన్ని అమలు చేశారని, కానీ లబ్దిదారులకువచ్చే వరకు రూ.20 వేలు మాత్రమే చేతికి వచ్చేవని, మిగతావి దళారులు తీసుకునే వారని ఎద్దేవ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమాతో పాటు ప్రతి పథకాన్ని నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోనే వేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. వేల్పూర్ మండలంలోని స్పైసెస్ సెంటర్‌లో గురువారం బాల్కొండ నియోజకవర్గం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. సీఎం కేసీఆర్ ముఖ్యఅథితిగా హాజరై ప్రసంగించారు.

'ప్రశాంత్ రెడ్డి నా కొడుకులాంటి వాడు.. ఇప్పటిలాగానే మళ్లీ పెద్దమనిషిగా ఉంటాడు.. పెద్ద మనిషిగా ఉంటే బాల్కొండ కూడా పెద్దవు తుందని, ప్రశాంత్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని' సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు.

కాంగ్రెస్ పార్టీ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏకబిగిన 50 ఏళ్లు పాలించిందని, ఇప్పుడు మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారని.. ఒక్క చాన్స్ ఇస్తే పంటికి అందకుండా మింగుతరా?

మిగతా 2లో...

మోడీకి ప్రయివేటీకరణ పిచ్చి

- సంస్కరణలు పేరుతో అన్నింటిని అమ్మేస్తుండు
- బాయికాడ మోటర్లు పెట్టాలని బెదిరించినా బెదరలే
- రాష్ట్రానికి వచ్చే నిధుల్లో కోత పెట్టారు
- బాల్కొండ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

సీపీఐ(ఎం) నుంచి మల్యాల గోవర్ధన్ బహిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) విధానాలకు వ్యతిరేకంగా పనిచేసిన పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మల్యాల గోవర్ధన్‌ను పార్టీ బాధ్యతల నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భవిష్యత్తులో తప్పు చేయనని చేసిన విజ్ఞప్తి మేరకు పార్టీ బాధ్యతలు అప్పగించినా వాటిని నిర్వర్తించకపోవడంతో 15 రోజుల క్రితమే పార్టీ నుండి బహిష్కరించినట్టు తెలిపారు. ప్రజా సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానంగా పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వలేని పరిస్థితుల్లోనే సీపీఐ(ఎం) నిర్వహించిన భూ పోరాటాలలో

మిగతా 2లో...



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

బీజేపీ రెండో లిస్టు విడుదల

- బోధన్ టికెట్ వడ్డీమోహన్‌రెడ్డికి, బాన్సువాడ నుంచి యెండల, రూరల్ బరిలో దినేశ్



వడ్డీ మోహన్‌రెడ్డి | యెండల లక్ష్మీనారాయణ | దినేశ్ కులాచారి

నవతెలంగాణ-నిజామాబాద్/బోధన్

బీజేపీ రెండో జాబితాను గురువారం విడుదల చేసింది. బోధన్ నుంచి వడ్డీ మోహన్‌రెడ్డికి టికెట్ కేటాయించగా, నిజామాబాద్ రూరల్ బరిలో దినేశ్ కులాచారి నిలుస్తుండగా.. బాన్సువాడ నుంచి యెండల లక్ష్మి నారాయణ పోటీ పడనున్నారు.

బోధన్ నుంచి వడ్డితో పాటు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి టికెట్ ఆశించారు. అయితే అధిష్టానం వడ్డిమోహన్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. ముఖ్యంగా సెటిలర్‌ల ఓట్లతో పాటు మైనార్టీల ఓట్లు రాబట్టుకోగలరని వడ్డికి పేరుంది.

వడ్డీ మోహన్‌రెడ్డి ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన ఆయన పార్టీ విధానాలు ఎమ్మెల్యే విధానం నచ్చక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి గత సంవత్సరం జూలైలో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. బిజెపి పార్టీలో బోధన్ నుండి

మిగతా 2లో...

నవతెలంగాణ

సీపీఐ(ఎం) నుంచి
మల్యాల గోవర్ధన్ బహిష్కరణ

-మొదటిపేజీ తరువాయి

పాల్గొని ఆ ప్రజలను మభ్యపెట్టి అదే పార్టీలోకి తనతో తీసుకెళ్లటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రజాస్వామిక వాదులు పార్టీ సానుభూతిపరులు శ్రేయోభి లాషులు గోవర్ధన్ చర్యలను గమనించి అతనికి పార్టీకి ఎటువంటి సంబంధం లేదని గుర్తించాలని సూచించారు. పార్టీ పేరును వాడుకొని స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేసే వ్యక్తులను సీపీఐ(ఎం) ఎప్పుడు క్షమించదని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్ రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పాల్గొని మాట్లాడారు.

బీజేపీ రెండో లిస్టు విడుదల

-మొదటిపేజీ తరువాయి

మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి అసెంబ్లీ టికెట్ ఆశించగా వడ్డీ మోహన్ రెడ్డికి ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో అసెంబ్లీ టికెట్ వరించిందని ప్రచారం. అర్బన్ టికెట్ దక్కక పోవడంతో రూరల్ బరిలో యెండల లక్ష్మినారాయణ బరిలో నిలుస్తారని ప్రచారం జరిగినా.. చివరకు ఎంపీ తన వర్గీయులకు టికెట్‌లు ఇప్పించుకున్నట్టు ప్రచారం.

బాలికపై కుక్క దాడి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలం లోని నడిపల్లి తండాలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఒక బాలికను పిచ్చికుక్క గురువారం తీవ్రంగా గాయపరిచిందని స్థానికులు తెలిపారు. పిచ్చికుక్క బాలిక ముఖానికి రెండు వైపుల గాయపర్చడంతో తీవ్ర రక్త స్రావంకవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.గత వారం రోజులుగా తండాల్లో పిచ్చికుక్క సంచరిస్తు స్థానికులకు, చిన్నారులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని వారన్నారు.

పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించిన ఎంపీడీవో

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపెట్, రెడ్డిపెట్ స్కూల్ తండా పోలింగ్ స్టేషన్‌ను ఎంపీడీవో సవితారెడ్డి గురువారం పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో వసతులు, ఏర్పాట్లపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వృద్ధులకు వీల్ చైర్స్, ర్యాంపు, వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నరేష్, రాజేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ వస్తే.. దళారుల రాజ్యం

-మొదటిపేజీ తరువాయి

అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు? ప్రశాంత్ రెడ్డి కన్నా ముందు చాలా మంది ఎమ్మెల్యేలు బాల్కొండలో ఉండేవారని, అప్పుడు ఏం జరిగింది.. ప్రశాంత్‌రెడ్డి హయాంలో ఏం జరిగిందో చర్చించాలని ప్రజలను కోరారు. ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో 18 సబ్ స్టేషన్లు నిర్మించాడని, 40 కి పైగా పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశాడన్నారు. తెల్లం దాకా..పొద్దాక కరెంటు ఇచ్చే కాంగ్రెస్ రాజ్యం రావాలా? 24 గంటలు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? సభలో ప్రజలను ప్రశ్నించారు. సబకాజరైన ప్రజలు 24 గంటల విద్యుత్ కావాలని చేతులెత్తి నినాదించారు. ఇండియా మొత్తంలో ఏ ఒక్క రాష్ట్రం కూడా 24 గంటలు కరెంటు లేదన్నారు. నీళ్ల ఫ్రీ ఇస్తున్నాం.. కరెంటు 2 గంటలు ఫ్రీగా ఇస్తున్నాం, రైతులకు పెట్టుబడి ఇస్తున్నాం.. రైతుల పంటలు కొంటున్నామన్నారు. జుక్కల్ ప్రాంతంలో వద్దయ్య అంటే పచ్చ జొన్నలు పండిస్తున్నారని, వాటిని వెయ్యికి రెండు వేలకు కూడా కొనరని రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనడం ద్వారా వచ్చిన నష్టాన్ని కూడా ప్రభుత్వం భరిస్తున్నదని తెలిపారు. ధాన్యం కొంటే 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు పడిపోతున్నాయని, దళారులు లేరు, మధ్యలో ఎవరూ లేరన్నారు. రైతు బీమా కూడా ఎవరూ పైరవీ లేకుండా రూ.5 లక్షల వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆపద్బంధు ఉండేదని, రూ50 వేలు అందించేవారని, అందులో రూ.30 వేలు దళారులు తినేవారన్నారు. కేవలం 20 వేలు మాత్రమే ఇచ్చేవారని కానీ ఇప్పుడు రూ.5 లక్షలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ చేతిలో ప్రభుత్వం ఉంటే ఎరువులు దొరకలేదు.. కరెంటు దొరకలేదు.. సాగునీరు లేదన్నారు. రైతుబంధు కోసం తనకు ఎవరు దరఖాస్తు పెట్టలేదని, ధర్నాలు చేయలేదన్నారు.

మంది మాటలు పట్టుకుని మార్వానం పోతే... ఇంటికి వచ్చే వరకు ఇళ్లు కాలిపోయిందన్నట్లు కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉంటుందన్నారు. భగీరథ బ్రహ్మాండగా విజయవంతం చేసుకున్నా మన్నారు. విద్యుత్ వినియోగంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందన్నారు. 17 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నప్పటికీ ఏ ఒక్క రాష్ట్రం కూడా బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ఆర్థిక పరిస్థితి పెరిగిన కొద్దీ పెన్షన్ పెంచుకుంటూ పోయినామని, రాబోయే రోజుల్లో 5 వేల పెన్షన్ రాబోతుందని తెలిపారు. పెన్షన్ దారుల ఒక్క ఓటు కూడా పోవద్దని, బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలని కోరారు. గత ప్రభుత్వాలు దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారన్నారు. దళితులను అంటరాని తనంగా చూశారని, వెలివాడల్లో నివసించేలా చూశారని, కాంగ్రెస్ వారి వల్లే దళితులకు నష్టం జరిగిందన్నారు. దళితబంధు తన మానస పుత్రిక అని పేర్కొన్న ముఖ్యమంత్రి అందరికి దళితబంధు అందేలా చూస్తామన్నారు. చేనేత కార్మికులు, గీత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు బీమా అడుగుతున్నారని, అందుకే 93 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నవారందరికీ బీమా తీసుకు వస్తున్నట్లు తెలిపారు.తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందని, తెలంగాణ రాకముందు 17 స్థానంలో ఉన్నామన్నారు. 10 ఏండ్లు తిప్పల పడ్డా ఫలితాలు మీ ముందున్నాయని తీర్పు చెప్పాల్సింది ప్రజలేనన్నారు. రైతుబంధు ఉండాల్నా లేదా అని అడిగితే ప్రజలందరూ కావాలని డిమాండ్ చేశారు.

24 గంటల ఉచిత కరెంటు ఉండాలా..? వద్దా..

మనుషులు మాట్లాడితే కొంత ఇజ్జత్ కూడా ఉండాలని, కేసీఆర్ కర్ణాటకను చూడటానికి రా... బస్సు పెడతానని కర్ణాటక నుంచి వచ్చిన అక్కడి ఉప ముఖ్యమంత్రి అంటున్నాడన్నారు. మేము ఐదు గంటల కరెంటు ఇస్తున్నాం. చూడాలంట. మన దగ్గరే 24 గంటలు కరెంటు ఇస్తున్నప్పుడు వాడు ఇచ్చే 5 గంటలు చూడటానికి వెళ్లాలంట అని ఎద్దేవ చేశారు. బీజేపీ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వచ్చి ఏదో చెప్పిపోతాడు, ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఇక్కడికి బ్రతుకడానికి వస్తున్నారు. వీళ్ల మాటలు చూసి రాయి పట్టుకుని తలపగుల కొట్టుకోవాలా? అని ప్రశ్నించారు. మీరు కొట్లాడాలి... నేను ఉద్యమం చేసినా.. తెలంగాణ కోసం పోరాటం చేసినా తెలంగాణ సాధించినా అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.



సభావేదికపై నృత్యం చేస్తున్న మంత్రి వేముల



ఉత్సాహంగా గంతులేస్తున్న కార్యకర్తలు

ఉద్యమంలో మోతె గ్రామానికి ప్రత్యేక స్థానం

తెలంగాణ ఉద్యమంలో వేల్పూర్ మండలంలోని మోతే గ్రామానికి ప్రత్యేక స్థానం ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి ఎప్పుడు వచ్చినా మోతె గ్రామం జ్ఞాపకం వస్తుందన్నారు. మూతి మట్టిలో బలం ఉందని, తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం మోతె గ్రామం మొదట తీర్మాణం చేసిందని గుర్తు చేశారు. మోతే మట్టిని ముడుపు కట్టుకుని హైదరాబాద్ కు తీసుకువెళ్లాలని, తెలంగాణ వచ్చినాక మళ్లీ ఇక్కడికి తెచ్చి మోతెలో అదే మట్టిని కలిపినట్లు తెలిపారు.

సభలో మంత్రి ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్న గారి జీవన్‌రెడ్డి, బీగాల గణేష్ గుప్తా, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, మాజీ ఎమ్మెల్సీలు బిజీ గౌడ్, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, మహారాష్ట్ర రైతు రఘునాథ దాదా, తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌ను గెలిపించండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గంలో ఆ పార్టీ కార్యకర్తలు గురువారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆదేశాల మేరకు పట్టణంలోని 46.47 వార్డులలో ప్రచారం కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రావడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కామారెడ్డిలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ ని, కేసీఆర్ పై భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భారీ స్పందన వస్తుంద ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అధికారంలోకి రాగానే వెంటనే అమలు జరుగుతాయని వివరిస్తున్నాము అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ కారంగుల అశోక్ రెడ్డి, పాక జ్ఞానేశ్వరి, పాత శివ కృష్ణమూర్తి, గోనె శ్రీనివాస్, కాకర్ల శేఖర్, మాజీ కౌన్సిలర్ బట్టు మోహన్, శ్రీనివాస్ యాదవ్, సలీం జాఫర్, ఎండి నజీర్, అప్రోజ్, లడ్డు, ఫిరోజ్, రహమత్, ఫారుక్, హనుమండ్ల, రవి, నారాయణ, దేవరాజ్, రియాజ్, సల్మాన్, మహిళా, అధ్యక్షురాలు సుమా నాగరాణి శిరీష.అబ్దుల్ బారి. జమీల్. సిద్దిక్ .తదితరులు పాల్గొన్నారు.

ఏది అడిగినా కాదనలే

- ముఖ్యమంత్రికి ఆజన్మాంతం రుణపడి ఉంటా
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి ప్రశాంత్ రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తండ్రిని కోల్పోయిన తనను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదరించారని... బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏది అడిగినా కాదనకుండా ఇచ్చారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ స్పైసిస్ పార్క్ లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు.

బాల్కొండ నియోజకవర్గానికి ఎస్సారెస్పీ పునర్జీవ పథకం వరం అన్నారు. కాకతీయ కెనాల్, వరద కాలువలు నిండు జీవనదిలా మారాయన్నారు. లక్ష్మీ, గుత్ప, నవాబు ఎత్తిపోతల పథకాలతో... ప్యాకేజ్- 20, ప్యాకేజ్ -21 తో పైన ఉన్న గ్రామాలకు కూడా నీరందించే సౌకర్యం కలిగిందన్నారు. నియోజకవర్గంలో 100 కోట్లతో 18 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1000 కోట్లతో నియోజకవర్గంలో బీటీ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించుకునే భాగ్యం కలిగిందన్నారు. కేసిఆర్ తిరిగి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అనగానే సభలోని ప్రజల హర్షద్వానాలతో సభా ప్రాంగణం మారుమోగింది.

ముఖ్యమంత్రికి పలు సమస్యలు విన్నవించిన మంత్రి..

ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వేముల ప్రశాంత్ రెడ్డి సభ ద్వారా పలు సమస్యలను విన్నవించారు. హనుమంత రెడ్డి ఎత్తిపోతల పథకంలో సిమెం టు పైపులు వాడడం వల్ల తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాటి స్థానంలో స్టీల్ పైపులు వేయించాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల కొలువైన లింబాద్రి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, పునర్జీవనంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎల్లవేళలా నీటితో కళకళలాడుతు న్నందున టూరిజం సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. నియోజకవర్గ కేంద్రమైన బాల్కొండను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని, తన సొంత మండల కేంద్రమైన వేల్పూర్‌లో జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటికే 15 వందల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించుకున్నామని, మరో 5 ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 5వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని అందించామని, మరో 10 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని అందించాలని కోరారు. నియోజకవర్గంలో మరో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు రహత్ నగర్, వాడి, బుస్సాపూర్ గ్రామాల్లో మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని మంత్రి ప్రశాంత్ రెడ్డి కోరారు. కొత్తగా బీడీలు చేసేవారికి కూడా పింఛన్లు అందించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ కొత్త మేనిఫెస్టో ప్రజలను ఆదుకునేలా ఉంది అన్నారు.

ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఇబ్బందులు ఉంటే సంప్రదించాలని రైతులకు సూచన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతుల ప్రయోజనార్థం జిల్లాలో వానాకాలం 2023 - 24 సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను గురువారం అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. వరి ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 421 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఇంకనూ మరికొన్ని చోట్ల కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462-293087, 8142200200, 9908276004 నెంబర్లకు సంప్రదించి ఫిర్యాదులు, సలహా లు, సూచనలు అందించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవా లని, నాణ్యతా ప్రమా ణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి పూర్తి స్థాయి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైతుల కు హితవు పలికారు. కార్యక్రమంలో డీసీఓ సింహాచలం, డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

పారిశుద్ధ్య కార్మికులకు సరుకులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలోని కట్ట మనోహర్ లక్షిత కట్ట మిథిల 5వ పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికుల మధ్య కేకు కట్‌చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మిథిలా తల్లిదండ్రులు తమ కూతురి పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ మాట్లాడుతూ కూతురి పుట్టినరోజు సందర్భంగా పంచాయతీ సిబ్బందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినందుకు ధన్యవాదాలు తెలుపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, మిథిలా తాతయ్య నానమ్మ కట్ట రాజ నర్సయ్య, లక్ష్మి, వారి కుటుంబ సభ్యులు రమణ, భరత్, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూలకాల పెట్టె పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

ఫిజికల్ సైన్స్ ఫోరమ్ అధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంక్సాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో తంగుడిగే శ్రీనివాస్ రావు రచించిన మూలకాల పెట్టె అను పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విజ్ఞాన శాస్త్రంను తెలుగు భాషకు అనుసంధానం చేస్తూ ఆటవెలది పద్యరూపంలో విద్యార్థులకు వినూత్న రీతిలో విజ్ఞాన శాస్త్ర పాఠ్యాంశాల పట్ల అమితాసక్తి, క్యూరియాసిటి పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా ఈ రెండవ సైన్స్ పుస్తకం రాశారన్నారు. గత ఏడాది సైన్స్ బాల వినోదిని రచించారని తెలిపారు. ముఖ్య అతిథిగా పీఆర్‌టీయు టీఎస్ రాష్ట్ర బాధ్యులు కమలాకర్ రావు, జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి హాజరై పుస్తకం ఆవిష్కరించారు. కమలాకర్ రావు మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయులుగా ఉండి తెలుగు భాషలో తమ పట్టుతో పద్యాలు రాయడం గొప్పతనం అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరీ, రాజేశ్వరి, లింగన్న, రాం మోహన్, మండల అధ్యక్షులు గంట అశోక్ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనులు

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన 6.5 కోట్ల నిధులతో మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ పంపు నుండి పోలీస్ స్టేషన్ వరకు పనులు మొదటి దఫా పూర్తి కానున్నాయని అన్నారు. ఇందుకు గాను ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్యలోనుండి 33 ఫీట్లు రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. మరో మూడు ఫీట్లు డ్రైనేజీకోసం రోడ్డు 72 ఫీట్ల వెడల్పు కానున్నదని అధికారులు తెలిపారు. ఇందుకు కావలసిన కొలతలు వేసి మార్కింగ్ చేపట్టారు. రోడ్డువెడల్పుకు ప్రజలు సహకరించి, పనులు వేగవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి అధికారులకు సూచించారు. సిరికొండ మండల కేంద్రాలతో పాటు కొండూరులోని వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గురువారం సందర్శించారు. కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. కాంటా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం తేమ శాతాన్ని మాయిశ్చర్ యంత్రం ద్వారా అదనపు కలెక్టర్ స్వయంగా కొలిచారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియచేయాలని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు కూడా ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని అన్నారు. కాగా, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ధాన్యాన్ని వెంటదివెంట లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ సింహచలం తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అమలుచేస్తాం

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల 50, 51, 28 డివిజన్‌లలోని శివాజీ నగర్, గురుద్వారా ఏరియా, గాజుల్‌పేట్, బ్రహ్మపురి కాలనీల్లో గురువారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిజామాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా యువత కోసం నిర్మించిన ఐటి టవర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మినీ ట్యాంక్ బండ్, ట్రాఫిక్ వెతలు తీర్చడానికి నిర్మించిన ఆర్ యు బి గురించి ప్రజలకు వివరించారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి డివిజన్‌లో వేసిన రోడ్లు, నిర్మించిన డ్రైనేజీల గురించి వివరించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. 400 రూపాయలకు వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు సౌభాగ్య లక్ష్మీ పథకం కింద నిరుపేద మహిళలకు రూ.3000 జీవన భృతి ఇస్తామన్నారు. అన్నపూర్ణ పథకం కింద తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి సన్నబియ్యం ఇస్తామన్నారు. మహిళ సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మిస్తామని మహిళలకు తెలిపారు. అభివృద్ధికి సహకారం అందించేందుకు, సంక్షేమం కొనసాగేందుకు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, సిర్ప రాజు, 50వ డివిజన్ కార్పొరేటర్ బట్టు రాఘవేందర్, మాజీ కార్పొరేటర్ కనకం సుధ సదానంద్, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు హారతి ఇస్తున్న మహిళలు

బీఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల గెలుపు కోసం నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, నాయకులు ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యం లో బి.ఆర్.ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వంలో నిజామాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

నేడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ



కుల సంఘాలకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో నేడు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ జరగనుంది. ఆలూర్ బైపాస్ రోడ్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే ఈ సభను నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పల్లె పల్లె నుంచి గులాబీ శ్రేణులు కదం తొక్కనున్న సభకు బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేశారు. 15 ఎకరాలకు పైగా ఉన్న స్థలంలో సభకు వాస్తు ప్రకారం అత్యాధునిక హంగులతో కేసీఆర్ ప్రసంగించే వేదికను నిర్మించారు. సభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంచినీటి, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసి సభకు వచ్చే వారి దాహార్తి తీర్చడానికి కూడా చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జనం అంచనాలకు మించి తరలి వస్తారని సమాచారం ఉండటంతో విశాలమైన స్థలాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఇక సభా ప్రాంగణాన్ని గులాబీ జెండాలు, కేసీఆర్ కటౌట్లతో అలంకరించారు. ఇదిలావుండగా సీఎం సభ సందర్భంగా పట్టణం గులాబీ వర్ణ శోభితమైంది. పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లను పార్టీ జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లతో అలంకరించారు. కాగా ప్రజా ఆశీర్వాద సభ గురించి గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గ్రామాలకు వెళ్లి ప్రజా ఆశీర్వాద సభకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి సతీమణి రజితారెడ్డి పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తూనే పట్టణంలో జరిగే సీఎం కేసీఆర్ సభకు రావాలని పిలుపునిచ్చారు. ఇక ఆర్మూర్ సీఎం కేసీఆర్ సభకుభారీ జన సమీకరణ చేయడం పై బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నజర్ పెట్టి అందుకు తగినట్లు చర్యలు తీసుకున్నారు. ఆయనే స్వయంగా సకల కులసంఘాల నేతల ఇండ్లకు వెళ్లిసభలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందించారు. గురువారం జీవన్‌రెడ్డి ఆర్మూర్ పట్టణంలోని అన్ని సంఘాలకు వెళ్లి వారిని ప్రజా ఆశీర్వాద సభకు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

60వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తా

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- నేడు సీఎం ప్రజా ఆశీర్వాద సభ

నవతెలంగాణ-ఆర్మూర్

60 వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తానని, కాంగ్రెస్ అంటేనే కరెప్షన్ పార్టీ అని, అవినీతి తిమింగలమని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీతో సహ పలువురు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. "గాంధీభవన్ మెగా మాల్‌లో టికెట్లు అమ్ముకునే బంపర్ ఆఫర్ స్కీము నడుస్తోందని, టిక్కెట్లు సేల్‌కు కోట్లల్లో డీల్ జరుగుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ టికెట్లు బడా ఫ్యామిలీలకు రెండు, మూడు ఇస్తూ బడుగు వర్గాలకు మొండి చెయ్యి చూపిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఈస్టిండియా కంపెనీ అయితే బీజేపీ నార్తిండియా కంపెనీ అని, ఈ రెండూ దేశాన్ని దోచుకునే దోపిడీ కంపెనీలేనని అన్నారు. కాంగ్రెస్‌బలం కర్ణాటక నోట్లు, బీఆర్ఎస్ బలం తెలంగాణ ఓట్లు. బీజేపీ గుజరాత్ మోడల్ ఫేక్. కర్ణాటకలో కాంగ్రెస్‌ది అవినీతి మోడల్" అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్, ఉద్యమ ఫ్యామిలీపై ఎందుకంత అక్కసు అని నిలదీశారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు కాంగ్రెస్ పార్టీయే కుటుంబ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ కు మళ్లీ ఘోర పరాజయం తప్పద న్నారు. ఇక బీజేపీ ఆడకుండానే ఓడిపోయిందని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ దెబ్బకు గ్రౌండ్‌లోకి దిగకుండానే బీజేపీకి మైండ్ బ్లాక్ అయిందన్నారు. బీజేపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. కాగా ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలంతా తన వైపే ఉన్నారని, 60వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 5వేల కోట్ల రూపాయలతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో శుక్రవారం కేసీఆర్ ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలంతా సభకు హాజరై విజయవంతం చేయాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డాక్టర్ మధు శేఖర్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రాల్లో అదనపు కాంటాలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

వాతావరణ మార్పులవల్ల రైతులకు ఇబ్బందులు కల్గకుండా కొనుగోలు కేంద్రాల్లో అదనపు కాంటాలు వెయ్యాలని జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సొసైటీ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా గత ఖరీఫ్ సీజన్లో సొసైటీ ఎన్ని కింటాళ్ళ వరి కొనుగోలు చేసిందని, ఇప్పుడు ఎన్ని కింటాళ్ళ వరి రానున్నదని కార్యదర్శి సంతోష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈయేడు వరి చాల బాగుంది, త్వరగా పూర్తి అయ్యే విధంగా చూడాలని అన్నారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటె తన దృష్టికి తేవాలని అన్నారు. ఇప్పటివరకు ఎంతమంది రైతులు ధాన్యం తరలించారని అడుగగా 150 మంది ధాన్యాన్ని తరలించారని మరో 150 మందివి ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు బదులిచ్చారు. ట్రాక్ షీట్లు ఎలా వస్తున్నాయి.. అలాగే గన్ని బాగులకు గాని, లారీల కొరత లేదని కొనుగోళ్ల వేగవంతం చెయ్యాలని సూచించారు. ఆయన వెంట డిసిఓ ,తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

అవినీతి నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్

అవినీతి నాయకులను ఓటుతో సాగనంపాలని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మిర్దపల్లి, రాంపూర్, ఇస్సాపల్లి, గుత్ప, దేగాం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటికొక ఉద్యోగం అని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి 5 ఉద్యోగాలు ఇచ్చుకున్నాడు కాని, నిరుద్యోగ యువతకు పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని అన్నారు. దళిత బంధు జాడ లేదని, ఊరికి రెండు వందల దళిత కుటుంబాలు ఉంటే ఒక్కరికి మాత్రమే దళిత బంధు ఇచ్చి దగా చేసాడని అన్నారు. ఈ గ్రామాల్లో గుత్ప, దేగాం ఎత్తిపోతాల ద్వారా సస్యశ్యామలం చేసాం అని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రియేంబర్స్ మెంట్, మోడల్ స్కూల్స్ వంటి పథకాలు తెచ్చాం అని అన్నారు. ధరణితో రైతులు అందరిని ఇబ్బందులకు గురి చేసాడు అని కాంగ్రెస్, అధికారంలోకి రాగానే ధరణి రద్దు చేస్తాం అని అన్నారు. జీవన్ రెడ్డి 100 కోట్లతో షాపింగ్ మాల్ కట్టుకున్నాడు కాని ప్రజలకు డబుల్ బెదురూమ్ ఇళ్ళు కట్టివ్వలేదని జీవన్ రెడ్డి తెలిపారు. తరిమికొడితేనే ఇళ్ళు వస్తాయి అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తాం అని అన్నారు, ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మార చంద్రమోహన్, యాల్ల సాయరెడ్డిలు మాట్లాడుతూ సోదరుడు వినయ్ రెడ్డిని బలపరిచి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండలంలోని రాంపూర్, మిర్ధాపల్లి, ఇస్సాపల్లి గ్రామాల్లో మహిళలు యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి వినయ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కోలా వెంకటేష్, పుట్టింటి శ్రీనివాస్ రెడ్డి, దూదిగాం ప్రమోద్, విట్టం జీవన్, సాయిబాబ గౌడ్, చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, మధు, శంకర్, శ్రీనివాస్, మల్లరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి

మాక్లూర్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటురి వినయ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుత్ప, గుత్ప తండా గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికొక ఉద్యోగం అని చెప్పి కేసీఆర్ ఇంటికి ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్నాడని, నిరుద్యోగ యువతకు పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అన్నారు, దళిత బంధు జాడ లేదని, ఊరికి రెండు వందల దళిత కుటుంబాలు ఉంటే ఒక్కరికి మాత్రమే దళిత బంధు ఇచ్చి దగా చేసాడని, పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మార చంద్రమోహన్, యాల్ల సాయరెడ్డి, మండల అధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, జిల్లా నాయకులు గంగాధర్ గౌడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

- వర్గీకరణపై ప్రధాని స్పష్టమైన హామీ ఇస్తే బీజేపీకి అండగా ఉంటాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నవంబర్ 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని, ఈ బహిరంగ సభకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా వస్తున్నారని, వర్గీకరణ విషయంలో ప్రధాని స్పష్టమైన హామీ ఇస్తే మాదిగలు బిజెపికి అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. గురువారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని అంబేద్కర్ కాలనీలో మాదిగల విశ్వరూప బహిరంగ సభ సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా మాదిగల భవిష్యత్తు కోసం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం జరుగుతుందని అన్నారు. ఈనెల 11 న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో లక్షలాది మంది మాదిగ, మాదిగ ఉపకులలా ప్రజలతో జరిగే మాదిగల విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేసిఆర్ వర్గీకరణ ఉద్యమం గురించి ఢిల్లీలో పోరాడిన చరిత్ర లేదని అన్నారు. కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో ఉండి కూడా వర్గీకరణ చేస్తామని చెప్పి మాదిగలను మోసం చేసిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో కూడా పదేళ్లు ఉండి కూడా ఒక్క నాడు కేంద్ర ప్రభుత్వానికి వర్గీకరణ బిల్లు మీద ఒక లేఖ రాయలేదని విమర్శించారు. బీజేపీ కూడా పదేళ్లుగా వర్గీకరణ చేస్తామని చెప్పి మాదిగలను మోసం చేస్తూనే ఉందని, ఇప్పుడు బీజేపీకి మరో అవకాశం వచ్చిందని, ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని మాదిగలకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. వర్గీకరణపై బీజేపీ వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బిల్లుపెడితే మాదిగ సమాజం మొత్తం అండగా ఉంటదని తెలిపారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంఛార్జి శనిగరం మురళి కృష్ణ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ, జిల్లా నాయకులు పెద్ది యమున, గుస్టు పద్మ, సావిత్రి, సుధ, ఎమ్మార్పీఎస్ టౌన్ సీనియర్ నాయకుల రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు రోడ్డ ప్రవీణ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఖోఖోలో సత్తాచాటిన కేజీబీవీ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని జెడ్పిహెచ్ఎస్ గండి మాసానిపేట్‌లో నిర్వహించిన నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీల్లో కస్తూర్బా బాలిక విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారిని భవాని తెలిపారు. 2015 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి పోటీలలో తమ పాఠశాలనే ప్రథమ స్థానం సాధిస్తున్నట్లు ఆమె అన్నారు. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పిఈటి స్రవంతి తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను ఉపాధ్యాయునిలు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్, కమ్మర్‌పల్లి గ్రామాల నుండి పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన సుంకరి గంగాధర్, నర్సయ్య, భూమన్న, సుంకరి రాజేశ్వర్, శ్రీను కాంగ్రెస్ పార్టీలో చేరగా వీరికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోనాపూర్ గ్రామానికి చెందిన వడ్డెర కాలనీ వాసులు రాజు, శేఖర్, రాజేష్, దశరథ్, రమేష్ మరో 50 మంది ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ, ముత్యాల సునీల్ కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట రవి, సింగిరెడ్డి శేఖర్, పాలెపు నరసయ్య, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

ఆలూర్ సొసైటీ చైర్మన్ తల్లి మృతి

- పాడే మోసిన ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ తల్లి బుధవారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి అంత్యక్రియలకు హాజరై పాడె మోశారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్ ప్రేమ్, దార్ల రాజు, దేగాం గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శ్రీ ముగ్ధలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-డొంకేశ్వర్

సిర్పూర్ దుర్గామాత ఉత్సవ సమితి వారు నడుకుడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ముగ్ధలేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం రూ.5116 విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో జక్కం మోహన్, కల మహేష్, ఉదయ్, ముకేష్, నితిన్ పాల్గొన్నారు.



విరాళం అందజేత

గౌడ్ ఆత్మీయ సమ్మేళనానికి తరలిన తొర్లికొండ గ్రామస్తులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గౌడ ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన గౌడ కులస్తులు ఊరేగింపుగా బయలుదేరారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్ఎల్జి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన నిజామాబాద్ రూరల్ గౌడ కులస్తుల ఆత్మయ సమ్మేళనానికి జక్రాన్ పల్లి మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన గౌడకులస్తులు గౌడ వేషధారణతో గౌడ వృత్తి పరికరాలతో హాజరైనట్లు తొర్లి కొండ గౌడ కులస్తులు తెలిపారు. గౌడ ఆత్మీయ సమ్మేళనానికి నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరు కాగా ఆత్మీయ సమ్మేళనలో భాగంగా తొర్లికొండ గౌడ కులస్తుల వేషధారణ ఊరేగింపు ప్రత్యేకతను చాటుకుంది. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల గౌడ కులస్తులు అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి తరలివెలుతున్న గ్రామస్తులు

c m y k



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఐసీఐసీఐ ఫౌండేషన్‌ప్రతినిధులు

పసుపురైతులకు శిక్షణ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం ఐసీఐసీఐ ఫౌండేషన్ అధ్వర్యంలో ఎంపిక చేసిన పసుపు రైతులకు వేప నూనె, కూరగాయ విత్తనాలు, లింగాకర్షక బుట్టలు, పసుపు రంగు జిగురు అట్టలు, వేస్ట్ డీకంపోజర్, ట్రైకోడెర్మా వీరిడే, సుడన్ గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకొని, ఆదాయం పెంచుకునేలా వారం రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలైన పశుపోషణలపై అవగాహన సదస్సులు చేపట్టినట్లు ఐసీఐసీఐ సీఎఫ్ సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సర్పంచ్ మారెల్లి విష్ణు హాజరై మాట్లాడుతూ.. ఐసీఐసీఐ ఫౌండేషన్ గ్రామంలో పసుపు రైతులకు ఏడు రోజుల శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. రైతులు వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారెల్లి విష్ణు, ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎఫ్. సాయికుమార్, రైతులు మార దిలీప్, అరుణ్, గంగారెడ్డి, జైడి వెంకటరెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు..

సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- కేంద్ర సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యులు ప్రవీణ్ శివాజీ రావు గుగే



ప్రవీణ్ శివాజీ రావు గుగేను సన్మానిస్తున్న ఏఐడీఎన్టీ ప్రతినిధులు

నవతెలంగాణ-నవీపేట్

సంచార జాతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని కేంద్ర సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యులు ప్రవీణ్ శివాజీ రావు గుగే అన్నారు. మండల కేంద్రంలోని డిఎన్టి జిల్లా అధ్యక్షులు జాదవ్ శరత్ నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. అనంతరం బిసి కమ్యూనిటీ భవనంలో ఓడ్, కైకాడి, మందుల, జోషి నందివాలా, వంజరి, మేదర, గోత్రాల,వడ్డెర, పెద్దమ్మలవారు, గిసాడి సంచార కులాల ప్రతినిధులతో ఆర్థిక , సామాజిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య మరియు నివాస సమస్యలతో పాటు కులాలను తిట్టు పదాలుగా ఉపయోగిస్తూ అవమానిస్తున్నారని రక్షణ కరువైందని కాబట్టి ఎస్సీ, ఎస్టీల వలె అట్రాసిటీ కేసు నమోదు చేసేల సిఫారసు చేయాలని, డిఎన్టి కమిషన్ ఏర్పాటు చేసి దాదా ఇదాతే కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు ప్రవీణ్ శివాజీ రావు గూగే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇంటి నిర్మాణంతో పాటు ప్రభుత్వం ద్వారా ఇంటి జాగాలు ఇవ్వడం స్థలం లేని ప్రదేశాలలో స్థలం కొనుక్కునేందుకు ప్రత్యేక ఆర్థిక సహకారాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కులవత్తుల అభివృద్ధికి ప్రత్యేక రుణ సహకారం అలాగే హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు సంచార జాతులు అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేసేలా కేంద్ర ప్రభుత్వం ద్వారా సిఫారసు చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా సంచార జాతుల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించిందని అందులో భాగంగానే సంచార జాతుల అభివృద్ధి, డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టనున్నట్లు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని సంక్షేమ పథకాలను పొందాలని జాతీయ సంచార జాతుల అభివృద్ధి మండలి ప్రధాన కార్యదర్శి అనిల్ పహాడ్ అన్నారు. అనంతరం సంచార జాతుల భాష అంతరించిపోతున్న దానిపై మందుల కులస్తులు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏఐడీఎన్టీ జిల్లా అధ్యక్షులు జాదవ్ శరత్, ప్రతినిధులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి చిరంజీవి, వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్తరంజన్ ఆయ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు

- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం
- ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తాం
- కేసీఆర్ ఓడితే ఇంట్లో కాదు జైలులో కూర్చోబెడతాం
- రూరల్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

కేసీఆర్ మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, ఈసారి రాష్ట్రంలో, రూరల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టనున్నారని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. గురువారం ఆపార్టీ నాయకులు మండల కేంద్రంలో మున్నూరు కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొన్నారు, మండలంలోని హొన్నజీపేట్ గ్రామా సర్పంచ్ భగవాన్ రెడ్డి, పాలక వర్గ సభ్యులతోపాటు వంద మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని ఏసిబి తండా ఉప సర్పంచ్ పెద్దన్న వారి బంధుప్రీతితోపాటు మరికొందరు తండాకు చెందిన గిరిపుత్రులతో కలిసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. మండలంలోని కొటాల్ పల్లి, సీతాయిపేట్, ధర్పల్లి, దమ్మన్నపేట్, డిబి తండా, దుబ్బాక, చల్లగర్గ, మైలారం, రామడుగు గ్రామాలనుండి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలనుండి కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికీ భూపతి రెడ్డి ఖండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు మండల కేంద్రానికి మార్కెట్ కమిటీ తెచ్చానని, దాన్ని కానివ్వకుండా బాజిరెడ్డి గోవర్ధన్ అడ్డుకొని పనులు చేయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బే ప్రాధాన్యం అనుకుంటే వైద్య వృత్తిలో సంపాదించేవాన్నని అన్నారు. నియోజక వర్గాన్ని బాజిరెడ్డి గోవర్ధన్ అభివృద్ధి చేయలేదని, నేడు వందల కోట్లుకు ఎలా వచ్చాయని ఆయన దుయ్యబట్టారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుంటే రాష్ట్రం అంధకారం అవడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదని, ఒక్క ఉద్యోగం రాలేదని, నోటిఫికేషన్ వేసేది వారే కోర్టులకు వెళ్లి ఆపేది వారే, నిరుద్యోగులు అనేకమంది నేడు రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేరలేదు.. రైతు రుణమాఫీ కాలేదు.. మండలంలో డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదు. దళిత బందు కొందరికే ఇచ్చారని, బిసి బందు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వండి.. ఆరు గ్యారంటీలు అందిస్తామని అన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంటుతో పాటు గృహాలకు ఉపయోగించే 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని, వంట గ్యాస్ కేవలం 5 వందలకే అందించనున్నా మని, ప్రతి ఇంట్లో 18ఏండ్లు నిండిన మహిళలకు అందరికి 2500 వేలు, వృద్దులకు 4 వేల పించిన ప్రతి నెల అందించనుందని తెలిపారు. రైతులకు, రైతు భీమా,2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో ఇవ్వనున్నామని అన్నారు,మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం అందించనున్నామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, సంతోష్ రెడ్డి, ఇమ్మడి గోపి, చెలిమెల నర్సయ్య, మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, భగవాన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, జాన్ రెడ్డి, నూత్పల్లి శంకర్, గంగారెడ్డి, సుమారు రెండు వేలకుపైగా ప్రజలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

కారు గుర్తుకే ఓటేస్తాం



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తాండ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రచారానికి వస్తున్నాంని తెలిపారు. బాజిరెడ్డికి గోవర్ధన్‌కు, కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ కారు గుర్తుకు ఓటేస్తామని తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రధాన కార్యదర్శి వసంతరావు, పార్టీ సీనియర్ నాయకులు రావుజీ నాయక్, ప్రకాష్ నాయక్, గ్రామ సదర్ నాయక్ గంగారం నాయక్, ఉప సర్పంచ్ మోతినాయక్, హరిచంద్ నాయక్, మధుకర్, రామ్ సింగ్, తారా, ఫుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

2375 జీవాలకు పారుడు రోగం నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని రాంచంద్రపల్లి గ్రామంలో గొర్రెలకు పిపిఆర్ టీకాలను పశువైద్య శాఖ అధ్వర్యంలో గురువారం వేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 2375 పశువులకు టీకాలను వేసినట్లు వైద్యాధికారి కిరణ్ దేష్ పాండే తెలిపారు. కార్యక్రమంలో డా. ఉమ్మమ శేహర్ వసు,వీఎల్ఓ వినిత, జేవిఓ గంగజమున, విఏ అహమ్మద్ పాషా, బెగ్, సుదీర్, గోపాలమిత్ర సిబ్బంది, గంగాధర్, శ్రీనివాస్, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించే వారికే మా ఓటు

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్లు

ఈపీఎస్ పెన్షనర్లకు రూ.9000లు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల కు ఇంటీరియమ్ రిలీఫ్ 30శాతం ఇస్తూ, నగదు రహిత వైద్యాన్ని ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేస్తామన్న వారికే రిటైర్డ్ ఉద్యోగుల మద్దతు ఉంటుందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కార్యవర్గం తీర్మానించింది. ఈ మేరకు గురువారం మల్లు స్వరాజ్యం ట్రస్టు భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు కే .రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. ఐఆర్ ఇస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతంతో ఇచ్చి ముష్టి వేశారని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయకుండా పెన్షనర్లను మోసం చేసిందని వారు అన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలిచ్చిన ఈపీఎస్ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో రూపాయి పెంచలేదని, గత పార్లమెంటు ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా నీటి మీద రాతలా మార్చాయని వారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల పెన్షనర్ల కుటుంబ ఓట్లు ఉన్నాయని, జిల్లాలో యాబై వేలకు పైగా ఉన్నాయని వారన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయ రావు, ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, కోశాధికారి ఈవియల్ నారాయణ, జిల్లా నాయకులు లావు వీరయ్య, భోజారావు, ప్రసాదరావు, అద్దంకి హుషాన్, సిర్పా హనుమాన్లు, రాధా కిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



సునీల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన శ్రీ కృష్ణ యాదవ సంఘ సభ్యులు 15 మంది, భీంనగర్ కాలనీకి చెందిన యూత్ సభ్యులు 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సునీల్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివ కుమార్, గడ్డం జీవన్, ముస్కు మోహన్, మునీర్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్కపూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని అక్కాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల చంద్రశేఖర రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన బోయి సత్తెమ్మ, సాయిలుకు చెందిన నివాసపు గుడిసె దగ్ధం కాగా ఆ కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చేవార్ నితిన్ నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం షార్ట్ సర్క్యూట్ వల్ల నివాసపు గుడిసె దగ్ధం అయ్యింది. దాంట్లో చేపలు పట్టే వలలు, కండేలతోపాటు, దుస్తులు ఖాళీపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే నితిన్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి బియ్యం నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొల్ల శ్రీకాంత్, రబ్బాని, చిర్రోల్ల రాకేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిక


బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట కాంగ్రెస్ అధ్యక్షులు కోమటి శాల రాజు, బిజెపి గ్రామ ఉపాధ్యక్షులు కర్రెమ్ రాజు, తోపాటు మద్దికుంట, రెడ్డిపేట్ గ్రామాలకు చెందిన 250 మంది బిజెపి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, గత తొమ్మిది సంవత్సరాల నుండి చేస్తున్న అభివృద్ధిని చూసి, కెసిఆర్ పోటీ చేస్తున్నందు కామారెడ్డి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు శంకర్, ఎంపీటీసీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి సల్మాన్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సల్మాన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదని, బిఆర్ఎస్ నాయకుల అభివృద్ధి మాత్రమే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, మహమ్మద్ షబ్బీర్ అలీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఆ అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తుందని, కాంగ్రెస్ ఇస్తున్న ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పేద బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ పుట్టినిల్లని అన్నారు. కార్యక్రమంలో దయానంద్, నర్సింగరావు, కూడెల్లి ఎల్లం, శ్రీను, గోనె దేవరాజు, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పోడు పట్టాలిప్పిస్తా

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్ హామీ


ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్

నవతెలంగాణ-లింగంపేట్(నాగిరెడ్డిపేట్)

పేదలందరికీ ఇండ్ల స్థలాలు, పక్క ఇల్లు అధికారంలోకి రాగానే నిర్మిస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సమస్యలు వెక్కిరిస్తున్నాయని ప్రజల, రైతుల అన్ని వర్గాల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. మండలంలో ఇళ్ల స్థలాలు లేక అన్ని వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. బీడి కార్మికులకు ఇల్లు లేనివారికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నాలుగున్నరేండ్లుగా ఎమ్మెల్యే సురేందర్ కుంభకర్ణ నిద్రపోయి ఎన్నికలు ఉన్నాయని ఇప్పుడు వస్తున్నాడని గ్రామాలలో రానివ్వకుండా నిలదీయాలని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మండలంలో మెజారిటీ గ్రామాల్లో పోడు పట్టాలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారందరికీ పోడుభూముల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు లేని పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి పక్క ఇల్లు నిర్మిస్తానని మదన్మోహన్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఎనిమిది అంబులెన్స్ ఏర్పాటు చేసి నాగిరెడ్డిపేటలో ఒక అంబులెన్స్ ద్వారా ప్రజలకు వైద్య సౌకర్యాలు సకాలంలో అందేలా కృషి చేశానన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోని ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే సురేందర్‌ను డిపాజిట్ రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. ఆపద సమయాల్లో ఆదుకుంటానని భారీ మెజారిటీతో గెలిపించాలని మదన్మోహన్ ఆకాంక్షించారు. మండలంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన బీడికార్మికుల, ఇళ్ల స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని వారి సమస్యలు పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. అనేకమందికి పెన్షన్లురాక యువతకు, ఉద్యోగాలు లేక పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు లేక ఆవేదన చెందుతున్నారని గుర్తు చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు కేసీఆర్ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని రైతులు దిగులు చెందుతున్నారన్నారు. ప్రజల అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తానని మదన్మోహన్ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరినవారిని మదన్ మోహన్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బీజేపీకి భారీ షాక్

- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కురుమ సాయిబాబా, ఎల్లారెడ్డి సొసైటీ డైరెక్టర్ నాగం గోపికృష్ణ బీజేపీ పార్టీకి రాజీనామా చేసి మదన్మోహన్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వారితోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది పైగా బిజెపి, బీఆర్ఎస్ నాయకులు యువకులు మదన్మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణం నుంచి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్‌రావు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ప్రజల ఆమోదం మీదకే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు అసెంబ్లీ టికెట్ కేటాయించిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని స్పష్టం చేశారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో వేలాది కోట్ల రూపాయలను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డికి చెందిన ప్రజలు రాత్రి అయినా పగలైనా నేరుగా తన ఇంటికి వచ్చి తమ సమస్యలను చెప్పుకునే చొరవ ఉన్నదని మదన్మోహన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పేరుతో పైకి వచ్చిన మరో నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సీట్ రాకపోవడంతో ఇవాళ బీజేపీలో చేరి తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మదన్మోహన్ పేరు ఖరారైన మరుక్షణం నుంచి ఆయా పార్టీల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చేన్న లక్ష్మణ్, షరీఫ్, మనోహర్ రావు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

షకీల్ గెలుపు ఖాయం

నవతెలంగాణ-ఎడపల్లి

త్వరలో జరగబోతున్న బోధన్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహమ్మద్ షకీల్ అమీర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఎడపల్లి మండల ఆ పార్టీ ఇన్చార్జి అబ్దుల్ వసేజ్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని జైతాపూర్ గ్రామంలో ఎన్నికల్లో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహమ్మద్ షకీల్ అమీర్ ఎడపల్లి, రెంజల్, నవీపేట్, బోధన్ మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ లత శ్రీ, సహకార సంఘం అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షకీల్‌ను విమర్శించే స్థాయి లేదు

నవతెలంగాణ-బోధన్

మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి ఎమ్మెల్యే షకీల్ ఆమీర్‌ను విమర్శించే స్థాయి కాదని సాలూర బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నేత బుద్దె రాజేశ్వర్ మాట్లాడుతూ కౌన్సిలర్ శరత్‌రెడ్డి గత చరిత్ర చూసుకొని మాట్లాడాలని హితవు పలికారు. గతంలో రైతుల దగ్గర ధాన్యం తీసుకొని, డబ్బులు ఇవ్వకుండా కోర్టు నుంచి ఐపీ పెట్టి నిండా రైతులకు ముంచిన ఘనత మీదికాదా అని నిలదీశారు. ఎమ్మెల్యే దొంగ అంటూ మాట్లాడి నువ్వు నిన్ను ఏమనాలో తెలుపాలని అన్నారు. గతంలో రైస్‌మిల్ మీద ఫిర్యాదు చేస్తే జిల్లా అధికారులు విచారణ చేసి ఎటువంటి అవినీతి లేదని తెలిపారని అన్నారు. కానీ మీ రైస్‌మిల్‌కు ప్రభుత్వం నుండి వడ్లు పంపారని మీరు దానిని అమ్ముకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై మాట్లాడిన అసభ్యకరమైన మాటలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మీకు మా కార్యకర్తలు అడ్డుకుంటారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు నర్సయ్య, సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్ధన్, మాజీ ఉప సర్పంచ్ సరిడే. సాయులు, బుయ్యన్. సురేష్ , సుధాకర్, శివకాంత్ పటేల్, నాగురావు, చందూర్. సాయరెడ్డి, నబ్బు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నీలాలో వాహనాల తనిఖీ


వాహనాన్ని తనిఖీచేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని నీలా గ్రామ శివారులో ఎస్సై ఉదయ్ కుమార్ ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా నగదును తరలించరాదని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక పోలీసు బందోబస్తుల మధ్య రోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలని ఆయన వాహనదారులకు సూచించారు.

పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఆయా పార్టీల మేనిఫెస్టోను, గతంలో ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. గోకుల్ చిన్న తండావాసులంతా ఎంపీపీ దశరథ్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. ఇసన్నపల్లిలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి బీఆర్‌తోనే సాధ్యం

● ఎన్నికల ప్రచారంలో హనుమంతు షిండే

నవతెలంగాణ-మద్నూర్

అభివృద్ధి బీఆర్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే హనుమంతు షిండే అన్నారు. గురువారం మండలంలోని పెద్దతడూగుర్, చిన్నతడుగూర్, అంతాపూర్, సోమూర్, దన్నూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ఈ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా ఉండేది కాదని, ఈ పది సంవత్సరాల కాలంలో ఈ మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం డబుల్ రోడ్డు, సింగిల్ రోడ్డు, బీటీ రోడ్లుగా మార్చామని తెలిపారు. ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా రోడ్డు సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రగతి పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, ప్రజా అవసరాల కోసం సంక్షేమ పథకాలు అమలు రైతు అభివద్ధి కోసం రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా, వద్ధులకు వితంతువులకు వికలాంగులకు ఒంటరి మహిళకు బీడీ కార్మికులకు గీతా కార్మికులకు పెన్షన్లు 200 నుంచి 2వేలకు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దతడుగూరు సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు బసవరాజ్ పటేల్, ఆ గ్రామ నాయకులు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, ఎంపిటిసి సభ్యురాలు, ఉపసర్పంచ్ సభ్యురాలు పార్టీ నాయకులు పాల్గొనగా చిన్న తడుగూర్ గ్రామ సర్పంచ్ సరస్వతి, నాయకులు పాండురంగ పాటిల్, అత్తాపూర్ సర్పంచ్ సుగుణబాయి, ప్రజాప్రతినిధులు డిసిసిబి డైరెక్టర్ రామ్‌పటేల్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్, ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి, యువ నాయకులు శివ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు గఫర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బన్సీ పటేల్, డోంగ్లి మండల అధ్యక్షులు శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే హనుమంతు షిండే

నేడు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ డివిజన్ ఉపాధ్యక్షులు అశ్వక్ హైమద్ తెలిపారు. వద్ధులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బోర్గం పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువగర్జన సభకు తరలిన నాయకులు



సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని శక్కర్‌నగర్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువగర్జన సభకు బోధన్, సాలురా మండలాల నుంచి యువకులు వాహనాలలో తరలివెళ్లారు. ఈ సభకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ హాజరవుతున్నారు. దాంతో ప్రతి గ్రామం నుండి యువకులు వాహనాలలో తరలివెళ్లారు.

దెమికలాన్ గ్రామంలో బబీఆర్ఎస్ పార్టీ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-తాడ్వాయి

దెమికలాన్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అభిమాన కార్యకర్తలు దేమికలాన్ గ్రామంలో అభివద్ధి మా విధానం, సంక్షేమమే మా నినాదం అంటూ బీఆర్ఎస్ జెండా పట్టు, సురేంద్ర అన్నకు జై కొట్టు అన్న నినాదంతో గ్రామంలోని గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివద్ధిని అమలు చేసిన పథకాలను గుర్తు చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దడిగే పౌరాజు, ఉపసర్పంచ్ ఇందిరా, వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని పార్టీపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

ఎల్లారెడ్డి బరిలో బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి

● ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గుండారం ఎంపిటిసి సభ్యుడు హాజీ నాయక్

నవతెలంగాణ-గాంధారి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పోటీలో మరో వ్యక్తి అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, రాజంపేట్ ఉమ్మడి మండల గుండారం గ్రామానికి చెందిన స్థానిక ఎంపీటీసీ హాజీనాయక్ బిఆర్ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీలో నిలబడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంతో పాటు వివిధ గ్రామాలలో గిరిజనుల అండ ఉందని, వివిధ గ్రామాలలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించడం, నిరుపేద విద్యార్థులకు వెన్నంటి నిలుస్తున్నానని అధికార పార్టీతో పాటు తాము చేసే సామాజిక సేవలు అందులో తనసొంత నియోజకవర్గ అభివద్ధి లక్ష్యంగా అసెంబ్లీ బరిలో నిలిచేందుకు అన్ని విధాల సమయుక్తమవుతున్నానని చెప్పారు.



ఎంపిటిసి సభ్యుడు హాజీ నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్ బీజేపీ అసంతప్తి అసమ్మతి నాయకులు వివిధ స్వచ్ఛంద సంస్థలు వివిధ కుల సంఘాలు నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

● అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎండి ముజీబ్

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ ప్రక్రియ కోసం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎండి ముజీబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వరకు అసెంబ్లీ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.



మద్నూర్ తహసీల్దార్ కార్యాలయం

బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో గురువారం బిఆర్ఎస్ ముఖ్యనేత బుద్దె రాజేశ్వర్ ఆధ్వర్యంలో మహిళలతో భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందల మంది మహిళలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా ఈ ర్యాలీలో పాల్గొని మహిళలతో బతుకమ్మ ఆడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. తెలంగాణ ప్రభుత్వంలోనే ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని, మరోసారి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ ప్రచారంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, సొసైటి చైర్మెన్ జనార్దన్, ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, జాగతి మండల కన్వీనర్ శివకాంత్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యువత

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఖాజాపూర్, హున్స, మంధర్న గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచారంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే బడుగు, బలహీనవర్గాలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ప్రజలు చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. అనంతరం హున్స సొసైటీ వైస్ చైర్మెన్ వినోద్ బాబుతో పాటు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ ప్రచారంలో నాయకులు ఆదినారాయణరెడ్డి, బుద్దె లక్ష్మణ్, చీల శంకర్, మంధర్నరవి, రాహుల లక్ష్మణ్, సొక్కిరవి పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుదర్శన్‌రెడ్డి

అనారోగ్యంతో సర్పంచ్ మృతి

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని జానకంపేట్ సర్పంచ్ సాయిలు యాదవ్ (32) అనారోగ్యంతో గురువారం మతి చెందారు. ఆయన 15 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. కాగా హైదరాబాద్ లో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. సర్పంచ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇదిలా ఉండగా.. గ్రామ అభివద్ధికి ఆయన చేసిన కషి చాలా గొప్పదని గ్రామస్తులు తెలిపారు. ఆయన మరణాన్ని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు



నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ యూత్ మండలాధ్యక్షులు చింతకుంట కిషన్ గురువారం ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో కార్యకర్తల మీద నమ్మకం లేక, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయడానికి, దేవుళ్లపై ప్రమాణాలు చేయిస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను నాయక్, హబీబ్ తదితరులు ఉన్నారు.

యూరియా బస్తాలు అందజేత



యూరియా బస్తాలను అందజేస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో రైతన్నలకు పొగాకు, శనగ, పంటల కోసం యూరియా అత్యవసరం కావడంతో నీల సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్ మార్క్‌ఫెడ్ అధికారులతో సంప్రదించి రెండు లారీలలో యూరియాను తెప్పించి రైతులకు అందజేశారు. సమయానికి గ్రామానికి యూరియా తెప్పించిన చైర్మన్‌కు వారు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు.

నా బలం బలగం బీడీ కార్మికులు, పేదలు

● బిఎల్‌ఎఫ్ అభ్యర్థి సిద్ధిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

నా బలం బలగం బీడీ కార్మికులు, పేదలు అని బిఎల్‌ఎఫ్ అభ్యర్థి సిద్ధిరాములు అన్నారు. గురువారం బిబిపేట్ మండలంలోని తుజాల్పూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముగ్గురు పెట్టుబడిదారులతో తాను పోటీపడుతున్నానని, తాను నమ్ముకున్న బీడీ కార్మికులు, పేద ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. బీడీ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన తనను, ఎమ్మెల్యేగా గెలిపిస్తే అన్ని వర్గాల సమస్యలు తీరుస్తానని అన్నారు. తాను బీడీ కార్మికునిగా, కార్మిక నాయకునిగా, పనిచేశానని గ్రామస్తులకు వివరించారు. తనకు ఒకసారి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి సిరిగాద సబిత, భూదేవి, భూమయ్య, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



మండలంలో శుక్రవారం మండలానికి జుక్కల్ నియో జకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ షిండే మండలంలో మొదటి విడత ఎన్నికల ప్రచారానికి వస్తున్న ట్లు ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాటేప ల్లి, కాటేపల్లి తాండ, బేగంపూర్, కాసలబాద్, వడ్లమ్, పెద్దదేవిసింగ్ తాండ, కుబ్యానాయక్ తాండలకు బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి హన్మంత్ షిండే ఎన్నికల ప్రచారం చేయడానికి వస్తున్న సందర్భంగా మండలంలో ని పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

బస్సు వచ్చేదెన్నడో..?

మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యాన్ని ఏర్పరచాలనే లక్ష్యంతో ఆర్టీసీ వ్యవస్థను ప్రభుత్వం ప్రారంభించింది. పలు పట్టణాలు, గ్రామాలకు బస్సులు నడుపుతున్నా.. చాలా గ్రామాలకు, గిరిజన తండాలకు బస్సులు నడవడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఇతర గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చాలా గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సు

- స్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు నడవాల్సిందే
- అత్యవసర సమయాల్లో ప్రజలకూ ఇబ్బందులు



నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలంలో 18 గ్రామ పంచాయితీలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గొడుగు మర్రి తాండాను పంచాయితీగా ఏర్పాటు చేసింది. దాని పరిధిలో మరో మూడు తండాలున్నాయి. ఆ మూడు తండాలకు సరైన రోడ్లు లేవు. సున్నపు రాళ్ల తండాకు మాత్రం తారు రోడ్డు వేసి మిగతా తండాలకు రోడ్డు సైతం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు మూడు కిలోమీటర్లు కాలినడకన అన్నారం వచ్చి బస్సు ఎక్కవలసి వస్తుంది. బట్టు తండాకు రోడ్డు ఉన్నా బస్సు రాకపోవడంతో దాదాపు రెండు కిలోమీటర్లు కాలినడకన నడవవలసి వస్తుంది. కన్నాపూర్ తాండ వాసులు కాలినడకన మూడు కిలోమీటర్లు మండల కేంద్రానికి నడుచుకుంటూ వెళ్లి బస్సులు ఎక్కే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నాపూర్‌లో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తే, విద్యార్థులు మాత్రం రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కవలసిన పరిస్థితి నెలకొంది. గొల్లపల్లి, ఉప్పల్వాయి, గోకుల్ తండాలకు కాలేజీలు ఉంటేనే బస్సులు వస్తున్నాయని, మిగతా సమయంలో ప్రైవేటు వాహనాలు ఆశ్రయించవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినా కనీస సౌకర్యాలు ఏర్పరచలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొడుగు మర్రి తాండ పరిధిలో రోడ్లను కూడా నిర్మించకపోవడంతో అత్యవసర సమయంలో వాహనాలు రాక తండావాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తొండలో దొంగతనం

- ఓ ఇంట్లో రూ.లక్ష నగదు, తులంనర బంగారం, వెండి అపహరణ
- మరో ఇంట్లో రూ.20వేలు చోరీ



చిందరవందరగా పడిఉన్న వస్తువులు

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ గ్రామంలో గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన మంత్రి పోశవ్వ సాయిలు దంపతులు 31.10.2023న తమ ఇంటికి తాళం వేసి ఆమె కూతురు ఇంటికి బోధన్‌కు వెళ్లారు. గురువారం ఉదయం 7 గంటలకు వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువా తాళం పగులగొట్టి అందులోనున్న సుమారు లక్ష రూపాయల నగదు, తులమున్నర బంగారం, 20 తులాల పట్ట గొలుసులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే వారి ఇంటి పక్కన ఇంట్లో 20వేల నగదును దొంగిలించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గ్రామంలోని సీసీ కెమెరాలు పరిశీలించి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

నాణ్యత (ఎఫ్.ఏ.క్యూ) ప్రమాణాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు ధాన్యం తరలించవలసినదిగా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. గురువారం రామారెడ్డి మండలం పోసానిపేట్, సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి, కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో కొనుగోలు కేంద్రాలను, సదాశివనగర్‌లోని బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, పద్మావతి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరం మేర గోనె సంచులు, లారీలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు వచ్చిన ధాన్యానికి ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా వెంటనే దించుకోవాలని, ఇందుకోసం అవసరమైన హమాలీలను, రైస్ మిల్లుల్లో ఖాళీ స్థలాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 280 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1428 మంది రైతుల నుండి 21 కోట్ల 62 లక్షల విలువచేసే 9,813 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అయితే తేమ, తాళ్లు లేకుండా, ధాన్యం తూర్పార బట్టి, ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, సంయమనం, ఓపిక పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, డిప్యూటీ తహశీల్దార్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదే రోజు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించబడుతుందని తెలిపారు. ఈ నెల 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. నామినేషన్లను ఈ నెల 3 నుంచి 10 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాలలోని రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఆర్.డి.ఓ. కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నామినేషన్లు మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మనుచౌదరి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఆర్.డి.ఓ. కార్యాలయంలో ఆర్.డి.ఓ మన్నె ప్రభాకర్ నామినేషన్లు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, నామినేషన్ పత్రాలు నింపడంలో తగు సూచనలు, సలహాలు ఇవ్వడానికి ప్రతి కేంద్రంలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు భారతీయ పౌరులై 25 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.



నామినేషన్లకు సంబంధించి అవగాహన కలిగి, దాఖలు చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లు చేయరాదని, తిరస్కరణకు గురయ్యే ప్రమాదముందని అన్నారు. నామినేషన్ పత్రంలో ప్రతి కాలం తప్పనిసరిగా నింపాల్సి ఉంటుందన్నారు. ఫారం-2 బిలో నామినేషన్ పత్రం సమర్పించాలని, జనరల్ అభ్యర్థులైతే 10 వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే 5 వేల డిపాజిట్ నగదు రూపంలో లేదా చలానా రూపంలో చెల్లించాలని సూచించారు. నామినేషన్ పత్రంతో పాటు 10 రూపాయల నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌పై ఫారం-26 అఫిడవిట్ సమర్పించాలని, క్రిమినల్ కేసులు ఉంటే ఆ పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. అదేవిధంగా ప్రమాణపత్రాన్ని అందజేయాలన్నారు. నామినేషన్ రోజు నుంచే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకుఖాతా తెరిచి ఆ ఖాతా నుంచే ఎన్నికల ఖర్చు నిర్వహించాలని, ఆ వివరాలు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయవలసి ఉంటుందన్నారు. పార్టీలు, అభ్యర్థులు యజమానుల అనుమతి లేకుండా వారి ఇండ్లపై గోడపత్రికలు, బ్యానర్లు, స్లోగన్‌లు ప్రదర్శించరాదని సూచించారు. ప్రచారసభలు నిర్వహించుకునేందుకు సకాలంలో దరఖాస్తు చేస్తే ట్రాఫిక్, శాంతిభద్రతల నిర్వహణకు పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తారన్నారు. దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ టివి, రేడియో, ఎఫ్ఎం రేడియోలు, దృశ్య శ్రవణ ప్రచారాలు, సినిమా హాళ్లలో ప్రచారం, బల్క్ సందేశాలు, రికార్డ్ చేసిన వాయిస్ సందేశాలు ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేయాలనుకున్న వారు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారాలపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు.

నిర్భయంగా ఓటువేయాలి

- కమిషనర్ కల్మేశ్వర్ నగరంలో ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో టౌన్ 1,2,4 పోలీస్ స్టేషన్ల పరిధిలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ గురువారం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ పాత కలెక్టరేట్ కార్యాలయం నుండి ప్రారంభమై ఎన్టీఆర్ చౌరస్తా, విజయ్ థియేటర్, ఎల్లమ్మ గుట్ట, ఎల్ఐసి ఆఫీస్, పూలాంగ్ చౌరస్తా, రాజ రాజేంద్ర చౌరస్తా, లక్ష్మీ మెడికల్, నెహ్రూ పార్క్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్లు ఎస్ జయ్ రామ్, గిరి రాజు, జితేందర్ నదావత్ (అసిస్టెంట్ కమాండెంట్), నిజామాబాద్ ఏసిపి, సిఐలు, ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ చెక్ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి



నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగరావుపల్లి వద్ద ఉన్న అంతర్ జిల్లా చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ సింధు శర్మ సంగారెడ్డి ఎస్పి సి.హెచ్.రూపేష్ గురు వారం సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సింగరావుపల్లి వద్ద ఉన్న అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను సందర్శించి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు.